క్లుప్తంగా

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

• కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకోవడంతో పెండింగ్‌లోనున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పన్ను వసూలు కూడా చురుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సచివాలయాల వారీగా పన్ను వసూళ్ల లక్ష్యాలను సమీక్షించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

భోగాపురం: మండలంలోని రావివలస ట్రంపెట్ బ్రిడ్జ్ కింద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న లారీ మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో రావివలస జంక్షన్ వద్ద విమానాశ్రయానికి సంబంధించిన ట్రంపెట్ బ్రిడ్జి కింద డ్రైవర్ లారీని పక్కకుతీసి ఆపి సేదదీరుతున్నాడు. ఇంతలో విశాఖపట్నం మురళీనగర్ చెందిన జోతేంద్ర నారాయణపాండే(41) తన సొంత పనుల నిమిత్తం బైక్‌పై విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా రావివలస ట్రంపెట్ బ్రిడ్జికి చేరుకునేసరికి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టి తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రికి దీనిపై ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.1.80 లక్షల జరిమానా

విజయనగరం క్రైమ్: విజయనగరంలో ఒక్క రోజులోనే బుధవారం 18మందిపై ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా వారికి మెజిస్ట్రేట్ రూ.1.80లక్షలు జరిమానా విధించారు. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందిని పట్టుకుని కేసులు నమోదు చేసిన వారిని విజయనగరం అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. దీంతో మెజిస్ట్రేట్ బి.రమ్య ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

'క్రాస్‌ప్రోగ్రాం'ను వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: పాడైన బోరుబావులకు మరమ్మతులు చేసేందుకు గాను అమలు చేస్తున్న 'క్రాస్ ప్రోగ్రాం'ను మండల వాసులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ కె. రామకృష్ణంరాజు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీటి ఎద్దడి నివారణా చర్యలలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా చేతి పంపులు పాడైతే కంట్రోల్‌రూమ్‌కు (సెల్: 97011 85131) సమాచారం అందించాలని సూచించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే సిబ్బంది గ్రామానికి చేరుకుని బోరుబావులకు మరమ్మతులు చేపడతారని చెప్పారు.

పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ అన్నారు. బుధవారం స్థానిక సాలిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ యాక్టివిటీపై సంసిద్ధత అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా ఉంచితే పిల్లలు కేంద్రాలకు రావడానికి ఆశక్తి చూపుతారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బొబ్బిలి సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లా అభివృద్ధి కోసం విరివిగా రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకులు భాగస్వాములు కావాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా పీఎం విశ్వకర్మ యోజనకు ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బ్యాంకర్లకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన ప్రతి దరఖాస్తునూ పరిశీలించి, వీలైనంత త్వరగా రుణం మంజూరు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి వచ్చిన అన్ని దరఖాస్తులను ఆమోదించి, వెంటనే గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా ముద్ర రుణాలను విరివిగా మంజూరు చేసి ఉపాధి కల్పించాలని సూచించారు. వర్క్‌షాప్‌లో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎల్‌డీఎం వీవీ రమణమూర్తి, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓ ఉమామహేశ్వరరావు, ఎస్‌బీఐ, ఇతర బ్యాంక్‌ల ఉన్నతాధికారులు, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ సెస్ వసూలు చేయండి

విజయనగరం అర్బన్: జిల్లాలో పేరుకుపోయిన లేబర్ సెస్ వసూలుపై దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. కార్మికశాఖకు సంబంధించిన ఈ శ్రమ్, లేబర్ సెస్ వసూలు, బాల కార్మికుల నిర్మూలన, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లేబర్ సెస్ వసూలు అంశం సమీక్షలో మాట్లాడుతూ.. మొత్తం నాలుగు విభాగాల్లో ఒక్క విజిలెన్స్ కింద సుమారు రూ.12 కోట్ల వరకు బకాయి ఉందని చెప్పారు. వీలైనంత త్వరగా దీనిని వసూలు చేయడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న సుమారు 1300 క్లయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని అసంఘటిత రంగంలోని కార్మికులందరినీ ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని.. నెలకు రూ.15 వేలు కంటే తక్కువ ఆదాయం ఉన్న వారంతా అసంఘటిత రంగ కార్మికులుగా పరిగణిస్తారని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వెట్టి చాకరీ, మానవ అక్రమ రవాణాలపై ముద్రించిన పోస్టర్లను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

సమావేశంలో ఇన్‌చార్జ్ జేసీ ఎస్.శ్రీనివాసమూర్తి, డీసీఎల్ ఎస్. ప్రసాదరావు, ఏసీఎల్ హెచ్‌టీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

11న చలో విజయవాడ

• ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుబ్బారాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుబ్బారాయుడు

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుబ్బారాయుడు కోరారు. బుధవారం స్థానిక అమర్ భవన్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.కామేష్, ఎస్. రంగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఇన్ని రోజులైనా ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మున్సిపల్ కార్మికులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాలు చెల్లింపులు, పనులు అప్పగింత, తదితర బాధ్యతలు మున్సిపల్ శాఖ వద్దే ఉండాలని స్పష్టం చేశారు. మరణించిన, రిటైర్మెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. అలాగే జీఓ 151 ప్రకారం పెంచిన వేతనాలు ఇవ్వాలని కోరారు. పదవీ విరమణ చేసిన కాంట్రాక్ట్ కార్మికులకు 75 వేల రూపాయలు గ్రాట్యుటీ, పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల కాళ్లు కడుగుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎన్నడూ వారికి అన్యాయం చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని ఎడల పోరాటం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పొడుగు రామకృష్ణ , దల్లై శీను, కళ్యాణ శీను, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

• ఏపీ రైతు సంఘం డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘ నాయకులు

విజయనగరం ఫోర్ట్: రైతులకు రుణమాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర పంటల బీమా అమలు చేయాలన్నారు. వ్యాపార రంగాన్ని కార్పొరేట్ల గుప్పిట్లో పెట్టేందుకు కేంద్రం డిజిటల్ అగ్రి మిషన్‌ను తెచ్చిందని, సహకార రంగాలను నిర్వీర్యం చేసే బహుళ సహకార వ్యవస్థ అమలును వ్యతిరేకరిస్తున్నామన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలను అందించాలని కోరారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద వెంటనే రూ. 20 వేలు అందించాలని డిమాండ్ చేశారు. పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం వేతనదారులకు పనిదినాలు పెంచి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. వాతావరణ పరిస్థితుల వల్ల పంటనష్ట పోతున్న మామిడి, జీడి మామిడి రైతులను ఆదుకోవాలని, పాల రైతులకు ప్రభుత్వం రూ.5 ప్రోత్సాహకంగా అందించాలని, మూతపడిన భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జి. కృష్ణమూర్తి, గాడు అప్పారావు, శ్రీనివాసనాయుడు, రకోడి రాములు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు సీజ్..

• పన్ను చెల్లించని దుకాణదారులపై కొరడా



దుకాణాన్ని సీజ్ చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

విజయనగరం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు పన్ను చెల్లించని దుకాణదారులపై కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది చర్యలకు ఉపక్రమించారు. ఈ మేరకు సహాయ కమిషనర్ కె. అప్పలరాజు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది బుధవారం కూడా పన్ను వసూలు ప్రక్రియ చేపట్టారు. కొంతమంది బకాయిదారులు ఇప్పటివరకు పన్నులు చెల్లించకుండా తాత్సారం చేయడంతో రెడ్ నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో కొన్ని దుకాణాలను మూసి వేయించారు. దీంతో కొంతమంది తక్షణమే స్పందించి పన్నులు చెల్లించేందుకు అంగీకరించారు. మిగిలిన వారు కూడా త్వరలోనే పన్నులు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అప్పటివరకు దుకాణాలు తెరవకూడదని సహాయ కమిషనర్ కె.అప్పలరాజు దుకాణదారులను హెచ్చరించారు. మరికొద్ది రోజుల్లో 2024 – 25 ఆర్థిక సంవత్సరం ముగిస్తున్న నేపథ్యంలో ఇప్పటికీ చాలామంది ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులు చెల్లించలేదన్నారు. దీంతో పన్ను వసూలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 8 సచివాలయాలకు ఒక్కొక్కరు చొప్పున విభాగాధిపతులను నోడల్ అధికారులుగా నియమించామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అప్పలరాజు, కిరణ్, వినోద్, చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అవగాహన సదస్సు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మెప్మా సంస్థ కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న జనరేట్ యువర్ బిజినెస్ ఐడియా అవగాహన సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో జిల్లా లీడ్ మేనేజర్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ.. శిక్షణలో తెలుసుకున్న వ్యాపార మెలకువలను వ్యాపార వ్యవహారాల్లో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముద్రా, పీఎంఈజీపీ, కార్పొరేషన్ రుణాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ చిట్టిరాజు, నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్, సదస్సు ఐఎల్‌ఓ ట్రైనర్ వి.అనిల్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ నుంచి బి.శశికళ, తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అంతర్జాతీయ సువార్తీకుడు సువార్తరాజు

విజయనగరం టౌన్: క్రీస్తుజనుల ఉపవాస దీక్షలు విజయవంతం చేయాలని అంతర్జాతీయ సువార్తీకుడు డాక్టర్ సువార్త రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబటిసత్రం వద్దనున్న ఏసు ప్రేమాలయంలో భస్మదీక్షల కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 వరకు దీక్షలు చేస్తారన్నారు. దీక్షాకాలంలో మాంసాహారాన్ని ముట్టకుండా ధ్యానంలోనే గడపాలన్నారు. పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాస్టర్ బర్నబాస్, అబ్రహం రాజు, పాలకొండ నుంచి పాస్టర్ డేవిడ్ రాజు, సూర్యనారాయణ, కోరాడ నాగేశ్వరరావు, వినిష్టన్, శంకరరావు, మాతారాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

• డీఎంహెచ్‌ఓ జీవన రాణి



కేఎల్‌పురం యూపీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక కేఎల్‌పురం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు, రోగులకు సంబంధించిన ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా బీపీ, సుగర్ రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలని చెప్పారు. సమయ పాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు గ్రాట్యుటీ..

నెల్లిమర్ల: సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ, గ్రాట్యుటీ అమలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఏమ్మార్సీ కార్యాలయం వద్ద ఆందోళన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు రామకృష్ణ, భారతి, అప్పలనాయుడు, పురుషోత్తమనాయుడు, బీవీ రమణ, ఎం.అచ్చెన్నాయుడు, వి. ఈశ్వరరావు, జి. లక్ష్మణరావు, ఎం. రేవతి, గోవిందమ్మ పాల్గొన్నారు.

సెలవుల పెంపుపై హర్షం

భోగాపురం: వైద్యశాఖలోని మహిళ ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఐదు రోజులు పెంచుతూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ ఎన్జీఓ భోగాపురం తాలుకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు, మహిళా కార్యదర్శి పి. కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వైద్యశాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు.. కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులకు మాత్రమే ఈ సౌకర్యం ఉండేదని, ఇప్పుడు ఈ ఉత్తర్వుల వల్ల ఏటా 35 రోజుల సెలవుల అర్హత ఉన్న శాశ్వత ఉద్యోగులకు కూడా ఈ సౌకర్యం కలగనుంది. దీంతో రెగ్యులర్ మహిళా ఉద్యోగులు సంవత్సరానికి 40 రోజుల సెలవులు పొందవచ్చన్నారు.

ఆక్రమణల గుర్తింపు



పీతలబంద చెరువులో నిర్మాణాలు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పీతల బంద చెరువులో చోటుచేసుకున్న ఆక్రమణలను తొలగించడానికి రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు వీఆర్‌ఓ రామకృష్ణ ఆక్రమిత ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. చెరువులో సుమారు మూడు సెంట్ల మేర ఆక్రమణలు జరగడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు జేసీబీతో తొలగిస్తామని వీఆర్‌ఓ తెలిపారు.

క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి కృషి

విజయనగరం టౌన్: జిల్లాలో ఉన్న క్రైస్తవ సంఘాల అభ్యున్నతికి తమ వంతుగా కృషి చేస్తామని బేతనీ మిషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ పాల్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బేతని మిషన్ చర్చి వెల్ఫేర్ సొసైటీకి క్రైస్తవ వివాహాలు జరిపించి, అధికారిక వివాహ సెర్టిఫికేట్లు జారీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పదేళ్ల పాటు లైసెన్స్ అందజేసిందన్నారు. క్రైస్తవులకు వివాహాలు చేసే అవకాశం తనకు లభించడం ఆనందంగా ఉందని చెప్పారు.

మహిళా పోలీస్‌స్టేషన్ సందర్శన..



మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, చిత్రంలో సీఐ నర్సింహమూర్తి

విజయనగరం క్రైమ్: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం విజయనగరంలోని కంటోన్మెంట్ లో గల మహిళాపోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ప్రాంగణం, గదులను, మహిళా దినోత్సవ ముగింపు వేడుకల ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు లింగ వివక్షపై చిత్ర లేఖనం పోటీలను నిర్వహించామన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ వద్ద ఈ నెల 8న నిర్వహించనున్న ర్యాలీలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ముగింపు వేడుకల్లో వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు సర్టిఫికెట్స్, బహుమతులను ప్రదానం చేయనున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు ఈ.నర్సింహమూర్తి, ఎస్పీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, ఎస్సై నర్సింగరావు పాల్గొన్నారు.

• కమిషనర్ పర్యటన..



విజయనగరంలోని 35వ డివిజన్‌లో కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం పర్యటించారు. వీటీ అగ్రహారం వద్ద ప్రారంభమైన పర్యటన డివిజన్ వ్యాప్తంగా సాగింది. ముఖ్యంగా పార్కులు, ఇతర ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉండడానికి గమనించి తక్షణమే పరిశుభ్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే చెత్తాచెదారాలు పేరుకుపోయిన కాలువలను చూసి సిబ్బందిని మందలించి, వెంటనే పారిశుధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

- విజయనగరం

బీసీలకు చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలి

విజయనగరం టౌన్: చట్ట సభల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక ఎస్.కన్వెన్షన్ టీఎస్ఆర్ గ్రాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా తాడ్డి శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సామాజిక న్యాయం స్పష్టంగా అమలుచేసే పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందన్నారు. 54శాతం ఓట్ బ్యాంక్ కలిగిన తమకు రాజకీయ పార్టీల ద్వారా సామాజిక న్యాయం లభించడం లేదన్నారు. మహిళా బీసీ జాతీయ నాయకురాలు దొమ్మేటి శిరీషా మాట్లాడుతూ.. మహిళలు రాజ్యాధికారంలో వాటా సాధించినప్పుడే ఈ దేశం అభివృద్ధి చెందుతుందన్న వాస్తవాన్ని మహిళలు కూడా గుర్తించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.పైడినాయుడు, వల్లూరు గౌరునాయుడు, ఉపాధ్యక్షురాలిగా సీహెచ్. చంద్రిక, కార్యదర్శిగా కిలారి రాంబాబు, చీపురుపల్లి నియోజకవర్గానికి పొట్నూరు నారాయణరావు, వైస్ ప్రెసిడెంట్‌గా చిన్నంనాయుడులు నియమితులయ్యారు.

వేతనదారులకు సకాలంలో బిల్లులు

నెల్లిమర్ల రూరల్: ఉపాధి హామీ వేతనదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని రైతు సంఘ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపేటలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ.. వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు తగ్గించి వేతనదారులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. రెండు వారాల్లోగా వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ.. నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పని ప్రదేశాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని.. ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వేతనదారులకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ వేతనదారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

భోగాపురం: ఏపీ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకురాలు కె. వాణిశ్రీ ఆధ్వర్యంలో మండలంలోని రెడ్డికంచేరులో పాడిపశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పది ఆవులు, రెండు గేదెల నుంచి రక్తనమూనాలు సేకరించి, ప్రయోగశాలకు పంపించారు. అలాగే వేసవి దృష్ట్యా పాడి పశువుల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఉమాశంకర్ మహాపాత్రో, ఎంఆర్‌పీ రామ్‌ప్రసాద్, సీహెచ్ లలిత, యు. రామరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

పెరిగిన జీతాలు ఇప్పించండి..



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వాస్పత్రులు, వైద్య కళాశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ పెస్ట్ కంట్రోల్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు పెంచిన జీతాలు ఇప్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో ప్రాణాలకు లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం తొలగించాలని చూడడం సరికాదన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మి, ఘన, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో రేషన్ సరుకులు..!



కిరాణా షాపులో పట్టుబడిన రేషన్ సరుకులతో సివిల్ సప్లై డీటీ శంకర్రావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో గల ఓ కిరాణా షాపులో రేషన్ సరుకులు దర్శనమిచ్చాయి. తమకు అందిన ముందస్తు సమాచారంతో పౌరసరఫరాల శాఖ డీటీ ఆర్.శంకర్రావు కిరాణా షాపులో బుధవారం తనిఖీలు నిర్వహించి రేషన్ సరుకులు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా డీటీ శంకర్రావు మాట్లాడుతూ గ్రామంలోని మామిడిపాక మురళి అనే వ్యక్తి కిరాణా షాపులో 4 క్వింటాళ్ల 10 కిలోల రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వం సరఫరా చేసే సుమారు ఇరవైన్నర కేజీల పంచదార, కందిపప్పు 13 ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు వ్యక్తిపై 6ఎ కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రైవేట్ దుకాణాల్లో రేషన్ సరుకుల అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా రేషన్ సరుకులు పక్కదారి పడితే తమకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన పాత నేరస్తుడు

విజయనగరం క్రైమ్: గవర్నమెంట్ రైల్వే పోలీసులకు పాత నేరస్తుడు పట్టుబడ్డాడు. ఎస్.కోట మండల సీతాంపురంనకు చెందిన గొల్లు దినేష్ కుమార్ (36) బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు, ఆర్పీఎఫ్ సీఐ అఖిలేష్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. నిందితుడ్ని విచారించగా.. పలు రైళ్లల్లో దొంగతనాలు చేసేవాడని తేలింది. ఇతని నుంచి 14 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.